

దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



సభకు హాజరైన ప్రజలు, అభిమానులు, బీఆర్‌ఎస్ శ్రేణులు

- లింగన్నది వైవిధ్యాల సమ్మేళనం.. పెన్ను, గన్నుతో పోరాటం చేసిన చరిత్ర
- తెలంగాణ ఉద్యమంలో జోడెడ్లలా పని చేసినం..
- సీఎం కేసీఆర్ స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం
- రామలింగన్న విగ్రహావిష్కరణ చేస్తానని కలలో ఊహించుకోలేదు
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

# ‘సోలిపేట’ది పేగుబంధం

దుబ్బాక టౌన్ అక్టోబర్ 2 : ‘దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి పేద ప్రజల పేగు బంధం.. వైవిధ్యాల సమ్మేళనంతో కూడిన జీవితం.. గన్ను, పెన్నుతో పోరాటం చేశాడు. అసెంబ్లీలో పేదల పక్షాన మాట్లాడి వారికి అండగా నిలిచాడు. తన జీవితాన్ని పేదలకే అంకితం చేశాడు. 25 ఏండ్లు జర్నలిస్టుగా, వామపక్ష ఉద్యమంలో పనిచేస్తూ తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా పనిచేసిన గొప్ప వ్యక్తి రామలింగన్న’ అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం దుబ్బాకలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వద్ద దివంగత ఎమ్మెల్యే సోలిపేట విగ్రహాన్ని కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రామలింగన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తానని కలలో కూడా ఊహించుకోలేదన్నారు. తాము తెలంగాణ ఉద్యమంలో కలిసి పనిచేసిన రోజులను మంత్రి గుర్తు చేసుకున్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమ స్ఫూర్తితో పని చేసిన రామలింగన్నది వైవిధ్యంతో కూడిన జీవన సమ్మేళనమన్నారు. నా ప్రాణం కన్న ప్రజలే మిన్న అని భావించిన వ్యక్తి అని, కండ్లు తెరిస్తే ప్రజలే.. కండ్లు మూస్తే ప్రజలే అనేవాడని మంత్రి పేర్కొన్నారు. దుబ్బాక అభివృద్ధిలో లింగన్న పాత్ర మరువలేనిదన్నారు. లింగన్న కుటుంబానికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని, లింగన్న సతీమణి సుజాతక్క తనకు తోబుట్టువులాంటిదన్నారు. కొడుకు సతీశ్‌రెడ్డిని రాజకీయంగా నిలబెట్టుతానని మంత్రి భరోసానిచ్చారు.

## బీజేపీ హయాంలో అభివృద్ధి శూన్యం

దుబ్బాక నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి చేసిన అభివృద్ధి కనిపిస్తున్నదని, మూడేండ్లలో బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిన అభివృద్ధి శూన్యమని మంత్రి మండిపడ్డారు. అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తే మోసపోయినం. డబుల్ బెడ్‌రూమ్, వంద పడకల దవాఖాన, ఐవోసీ భవనం, సీఎం కేసీఆర్ బడి, వేంకటేశ్వర దేవాలయం వంటి అభివృద్ధి పనులు లింగన్న హయాంలో జరిగాయన్నారు. నాడు సుజాతక్క గెలిచి ఉంటే సీఎం కేసీఆర్‌ను దుబ్బాకకు తెచ్చి రూ.500కోట్లతో అభివృద్ధి చేస్తానని మాటిచ్చిన. చెప్పుడు మాటలకు మోసపోయి అభివృద్ధిని ఆపుకొన్నామని, మరోసారి మోసపోవద్దని ప్రజలను ఉద్దేశించి మంత్రి అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి లింగన్న ఆత్మకు శాంతి కలిగించాలన్నారు. నియోజకవర్గంలో లింగన్న ప్రజాప్రతినిధులుగా తయారు చేయడంలో కష్టం, కృషి ఉందని ఉద్ఘాటించారు. సోలిపేట రామలింగన్న కుటుంబం బీఆర్‌ఎస్ వెంటే ఉంటారని వారంతా తన కుటుంబ సభ్యులు అని, అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని మంత్రి స్పష్టం చేశారు.



లింగన్న విగ్రహావిష్కరణ సభలో భావోద్వేగానికి గురైన సుజాతను ఓదారుస్తున్న మంత్రి

## పేదల సేవకే లింగన్న జీవితం అంకితం :

*-రామలింగారెడ్డి సతీమణి సుజాత*

పేదల సేవకే రామలింగన్న తన జీవితాన్ని అంకితం చేశారని ఆయన సతీమణి సుజాత పేర్కొన్నారు. పెన్ను, గన్ను, వరకట్నం, మద్యపాన నిషేధం వంటి ఉద్యమాల్లో పాలుపంచుకొని తనకంటూ గుర్తింపును పొందారన్నారు. రామలింగారెడ్డి చేసిన సేవలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఆయన ఆశయసాధన కోసం అభిమానులు, కార్యకర్తలు కృషిచేయాలని, అప్పుడే ఆయనకు నిజమైన నివాళి అని తెలిపారు. సోలిపేట కుటుంబం పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని సుజాత, కొడుకు సతీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యమం కోసం పని చేసిన తమ కుటుంబం ప్రాణం ఉన్నంత వరకూ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ వెంటే ఉంటుందన్నారు. లింగన్న జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కన్నీరు పెట్టిన సుజాతను మంత్రి హరీశ్‌రావు ఓదార్చారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, నాయకులు రొట్టె రాజమౌళి, మనోహర్‌రావు, మామిడి మోహన్‌రెడ్డి, వెంకట నర్సింహారెడ్డి, జట్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సుగుణ బాలకిషన్‌గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ చింతల జ్యోతీకృష్ణ, ఆస స్వామి, పర్స కృష్ణ, రొట్టె రమేశ్, మూర్తి శ్రీనివాస్‌రెడ్డి, గుండెల్లి ఎల్లారెడ్డి, వంశీ, రణం శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లింగన్న ఆశయసాధన కోసం పనిచేద్దాం

*-మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి*



తెలంగాణ ఉద్యమంలో ముందుండి నడిపిన నాయకుడు లింగన్న అని, తెలంగాణ సాధనలో ఆయన పాత్ర మరువలేనిదని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తాను రెండుసార్లు ఎం పీగా పోటీ చేస్తే తన గెలుపులో లింగన్న పాత్ర చాలా గొప్పదన్నారు. 2004లో రామలింగన్న గెలుపుతో తెలంగాణ ఉద్యమానికే ఊపు వచ్చిందని, ఆయన కృషితోనే దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ తిరుగులేని శక్తిగా తయారైందన్నారు. అలాంటి నాయకుడు నేడు మన మధ్య లేకపోవడం దురదృష్టకరమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రతి నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండి సేవలందిస్తానని ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి హామీనిచ్చారు.

# అభివృద్ధిలో తెలంగాణ నెంబర్ వన్

- అభివృద్ధి, సంక్షేమం బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రెండు కండ్లు
- ప్రజలకు పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

దుబ్బాక టౌన్, అక్టోబర్ 2 : దేశంలోనే తెలంగాణ అభివృద్ధిలో నెంబర్‌వన్ స్థానంలో ఉందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన, పారదర్శకమైన పాలనందించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదన్నారు. దుబ్బాకలో రూ.17కోట్లతో నిర్మించిన ఐవోసీ (సమీకృత కార్యాలయ భవనం) ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నదన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నదన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన తహసీల్, పంచాయతీరాజ్, అటవీశాఖ, హార్టికల్చర్ తదితర కార్యాలయాలను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ప్రారంభించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశ మందిరంతోపాటు వివిధ శాఖల కార్యాలయాలను పరిశీలించిన మంత్రి వసతులపై కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను మంత్రి హరీశ్‌రావు సన్మానించారు. అనంతరం మంత్రి సమక్షంలో అదనపు కలెక్టర్ తన విధులను ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని గాంధీ చిత్రపటానికి మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఐవోసీ భవనంలో హార్టికల్చర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఐవోసీ భవనంలో రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న గరిమా అగర్వాల్



గజ్వేల్ మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి

# సీఎం కేసీఆర్‌తోనే గ్రామ స్వరాజ్యం

## ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 2 : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వారు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతియుతంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహానుభావుడు మహాత్మాగాంధీ అన్నారు. శాంతిమార్గాన్ని ఎంచుకుని నిరాహార దీక్షతో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ ప్రజలకు జాతిపిత అయ్యారన్నారు. ప్రజలంతా గాంధీజీ మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కమిషనర్ విద్యాధర్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, మెట్టయ్య, రజిత, బాలేశ్, బాలమణిశ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీకిషన్‌రెడ్డి, చందు, రహీం, శ్యామల మల్లేశం, చందనారవీందర్, భాగ్యలక్ష్మీదుర్గాప్రసాద్, విద్యారాణీశ్రీధర్, కోఆప్షన్ సభ్యులు రాజు, ఏఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.